


# నాగస్వరమ్



శ్రీ సహజానంద.

అది నాగులచవితి. మా యింటికి పాములవాడు వచ్చాడు. అతని చుట్టూ జనం చాలామంది మూగారు. పాములవాడు అంటే నాకు చాలా భయమని పెద్దలకు తెలుసు. అందుకని, మాతాత నన్ను తన ఒడిలో కూర్చోపెట్టుకొని, బుట్టపై మూత తీయమన్నాడు—పాములవాణ్ణి. ఆపై మూతమీద పాములవాడు చెయ్యివేశాడు. నా గుండె జలదరించింది. కళ్ళు బైర్లు కమ్మినయ్. పిల్లలందఱూ ఱెప్పలు వాల్చకుండా చూస్తున్నారు. మా తాత ఇలా అన్నాడు; "నాగస్వరం తన్మయుడపై పాడాలి. లయ తప్పకూడదు; అప్పుడు విష సర్పం మన హృదయాలకు పుష్పహారమౌతుంది, అంతా నిశ్శబ్దంగా వుండండి. ఏయ్! పిల్లలూ కూర్చోండి. మాట్లాడకండి!' మా తాతకు సంగీతం ప్రీతి. ఆయనకు దేవుడు గాత్రం మధురంగా ఇవ్వలేదు గాని. లేకపోతే ఆయనకున్న శాస్త్రజ్ఞానానికి, బతుకురాదలో కూరుకుపోయిన జగత్తుకు జోలపాట పాడేవాడు కాదూ! ఆయన గాన శ్రవణంలో లీనమై, స్వర్గం చేరేవాడు.

పాములవాడు! చినిగి, చీలికలు వాలికలైన చొక్కా, వికాసంలేని ముఖం, అనాగరికుడు, అడివిమనిషి....అయిదునిమిషాలు యోగ సమాధిలో మగ్నమయాడు, 'మనందఱి ప్రశాంతమే నాగస్వరానికి శ్రుతి!' అన్నాడు తాత, ఈయనమీద లక్ష్యంతో పాములవాడు నమస్కారం చేసి, ఇలా ఆకాశంలోకి ప్రార్థించాడు. 'ఓ! నాగుమయ్యా! నువ్వే నేను. నేనే నువ్వు!'

బుట్టతీశాడు. ఉలిక్కిపడ్డాను. పాములవాడు నాగస్వరం పాడే 'బుర్ర' నోట్లో పెట్టుకొని, పాట ఆరంభించాడు. బుట్టలో చుట్టలుచుట్టుకొన్న తాచుపాముమీద అతని దృష్టి, అతనిమీద తాతదృష్టి లగ్నమైనయ్.

తాచుపాము మేల్కొంది. చుట్టూ శ్రోతలను చూసింది. నేననుకున్నంత విష జంతువు కాదని గ్రహించాను. తలెత్తింది. పాములవానిపాట హెచ్చుస్థాయిలోకి వెళ్తోంది. అతడు ధ్యానంలో లీనమై, నాగస్వరాన్ని లయ తప్పకుండా ఆలాపిస్తున్నాడు. తాత అచలంగా కూర్చున్నాడు. జనం వింతగా చూస్తున్నారు.

పాములవాని పాట వూపేస్తోంది. పడగ విప్పింది. ఆ పడగలోంచి దివ్య తేజస్సు ప్రసరించింది. పాములవాడు మఱింత పట్టుగా పాడుతున్నాడు. తాత వూగిపోతున్నాడు.

నిశ్చలంగా నుంచోని, కృష్ణసర్పం ఒక బిచ్చగాడు వినిపిస్తున్న గానాన్ని ఆలకిస్తూ మైమఱుస్తోంది. లోకంలో విష సర్పాలకు ఈ విధమైన మనోహర గానాన్ని వినిపించగలిగితే, విషం మధురమై, అమృతమవదూ! ఆ దృశ్యం చూస్తుంటే, పామును ముద్దిడుకున్నా భయం లేదనిపిస్తుంది. సంగీతం, మృత్యువుకుతోటిదైన తాచుపాము కెంత ఆనందం కలిగిస్తోందో వూహించుకుంటే, మన అసమర్థతకు సిగ్గిలుతాం. మానవులకు భయానకమైన ఈ సర్పంలో ఎంత గ్రహణశక్తి వుంది!

ఒక గంట గడచింది. పాములవానికి స్మృతి తప్పింది, పరిసరం మఱచిపోయాడు. గుక్క తిప్పుకోకుండా, హెచ్చుస్థాయిలో, మనోహరంగా పాడుతున్నాడు. సర్పం అచలంగా మత్త్యచలనాన్ని అతి

క్రమించి, దివ్యత్వంలో లీనమై గాన మాల కిస్తోంది. తాత కళ్ళల్లో నీళ్ళు చిందినయ్. గానంయొక్క గమనం శిఖరాన్ని చేరుతోంది. రాగాలాపన ఆత్మకు శాంతినిద్ర అయింది. శ్రోత తూలిపోతున్నాడు. పరిసరంలో, ప్రకృతిలో, ప్రపంచంలో ఆ నాగ గానంయొక్క ఒకే ఒక ఆలాపన వినిపిస్తు నట్టుగా వుంది. గంజితేమైనా తాకని ఒక బిచ్చగాని గొంతుక పాడే పాటకు మా అందరి హృదయాలు అర్పితమైనయ్. ఆపాట మా దేహాలను జోగొట్టి, అంతరాత్మలను మేల్కొల్పి, సంగీతసమాధిలో ఐక్యం చేసింది. ఎదురుగా విషసర్పం గానమాధుర్యాన్ని గ్రహిస్తూ, తేజస్సును ప్రసరిస్తూ జనానికి ప్రియమైంది. నాగస్వరం ఒక్కసారిగా ఆగింది. అందఱూ చకితులయ్యారు. పాములవాడు పరవశుడై పడిపోయాడు. తాచుపాము కళ్లు తెఱచింది. పిల్లలు ఒడ్డిగిలారు.

మెల్లగా లేస్తూ, 'బాబూ!' అన్నాడు పాములవాడు. తుంబురునికే సాహసం వుంటే. దేవలోకంలోంచి దిగివచ్చి, ఈబికారి యెదుట పరీక్షకు, పోటీకి నిలబడేవాడు కాదూ!

మితిలేని కోపంతో పాము యజమానిపై బుస్సు మంది. 'ఇకపాడలేను దేవుడా!' అన్నాడు బిచ్చగాడు.

తాత ఇలా అన్నాడు: నోరులేక పోయినా, వాటికి జ్ఞానం వుంది, గ్రహణ శక్తి వుంది. వాటికీ సుఖదుఃఖాలూ, వాటి విచారణా కూడా వున్నయ్!'

* * *

స్మృతి గవాక్షం తెఱచి, గతంలోకి చూస్తే, ఈ బాల్యానుభూతి జ్ఞప్తికి వచ్చింది. దీనివల్ల మనస్సులో గందరగోళానికి మఱింత వేగం హెచ్చింది.

భార్యకు గుండె జబ్బు. విధిని ప్రార్థిస్తూ మృత్యువునుపేడుకుంటూ, నిరంతరం అర్థాంగి దగ్గఱ కూర్చొని. ఆమె ఆయాసం, ఆవేదన, బాధ చూడలేక గదిలోంచి బైటికి వచ్చి వరండాలో కూర్చున్నాను. చెవుల్లో రోగిమూలుగు వినబడుతోంది. పిల్లడు దగ్గఱకువచ్చి, 'నాన్నా! అమ్మ యెక్కడికో వెళ్తానంటోంది. ఎక్కడికీ?? నేకూడా యెల్లద్దూ!' అని అడిగాడు.

నా కంఠంలో దుఃఖం నిండింది. 'అక్కడకు అందర్నీ ఒక్కసారిగా రానియ్యరు. రానిస్తే బాగానే వుండును! ఒక్కొక్కళ్ళే వెళ్ళాలి. అయినా, అమ్మ యిప్పుడే యిలాగే వెళ్ళిపోతుందా?' అన్నాను.

ఎదురుగా తోటలో చిలుకల గుంపులు వాలినయ్, వాటితో పిల్లవాడు ఆడుకుంటు న్నాడు.

సిరాళ నన్ను నిద్రపుచ్చింది. డాక్టరు బూట్లచప్పుడు మేల్కొల్పింది. ఇద్దరం కలసి గదిలోకి వెళ్ళాం. రోగినిచూసి, 'ఏం గల్లంతు పడకండి. చాలా నిశ్శబ్దంగా, ప్రశాంతంగా వుండాలి' అని చెప్పి వెళ్ళి పోయాడు.

'ఆయన అటు, నేను యిటు,మీరొక్కరూ ఒంటరిగా ఇక్కడ!' అన్నది మెల్లగా రోగి.

వీటివల్ల నాకెలాబాధ, జాలి కలిగినయో నే వ్రాయలేను. చెప్పలేను.

అక్కడే వుంటే, ఏదో మాట్లాడ్డం జరుగుతుందని, అదికూడదని మళ్ళీ వరండాలోకి వచ్చాను,

దూరంగా వీధిలోపోతున్న బళ్ళచప్పుడు, సంభాషణలుతప్ప ఇక్కడ ప్రశాంతిని ఇంకేదీ కలవరపఱచట్లేదు. నేను ఏదో—ఏమై వుంటుంది?—ఆలోచిస్తున్నాను.

'పా....ము....అ....యో్యా....రం....డి! గాభరాపడ్డాను. కొయ్య అయ్యాను. తడబడుతూ గదిలోకి వెళ్ళాను.

'అదిగో!' అని ఒక మూలచూపించింది రోగి. ఆమూల చూచాను....ఒకపాము.... తాచు పడగ విప్పుకొని నాకేసి చూస్తోంది. నాగుండె జలదరించింది. రోగి భయంతో స్తబ్దు అయింది. 'ఓ! సుబ్రహ్మణ్యేశ్వరా! నీకోదణ్ణం' అంది రోగి.

పాము ఎటూ కదలలేదు. మంత్రింపబడిన దానివలె, పడగ విప్పుకొని నిలబడ్డది. నేను కఱ్ఱ ఎత్తాను.

'అయ్యో! మీరు చంపలేరు. అయినా, ఈ సమయంలోవద్దు' అన్నది. మాట్లాడవద్దని సైగజేశాను. ఏమాదిరిగల్లంతైనా ఆమెకు ప్రమాదం.

నేనెప్పుడూ పామును కొట్టలేదు. నాకు భయంపోయి, పైగా తెగువు, సాహసం కల్గినందుకు మావాళ్ళంతా నన్ను పొగడారు. కాని నన్ను నేనే దూషించుకుంటున్నాను—నాతోపాటు ఇంకొక ప్రాణిని దుఃఖాగ్నిలో దగ్ధంచేశానే అని! నాతోపాటు ఇంకొక ప్రాణిని శుష్కహృదయంతో చరమగీతి ఆలాపనకై ప్రతీక్షింపచేశానే అని!

కఱ్ఱతో ఒక దెబ్బకొట్టాను. బుస్సుమంటూ నిలువునా లేచింది. పడగ బాగా విప్పింది. ఉజ్వలమైన ఆ రూపు నన్ను క్షమింపజేసింది. రోగి ఏడుస్తోంది.

మళ్లీ కొట్టాను. ఈసారి దెబ్బతగిలింది. పామునడుం విరిగింది. కాని విజృంభణ హెచ్చింది. దాని ప్రచండ శౌర్యానికి నేను జంకాను.

నెత్తురుతో కఱ్ఱ ఎఱ్ఱబడ్డది. తీవ్రంగా కొట్టాను. ఈసారి నేలమీదపడుకొంది. నోట్లోంచి నెత్తురుకక్కింది. మృత్యుభారంతో మూసుకుపోతున్న కళ్లు పిచ్చిగా నాకేసి చూసినయ్! నా హృదయం క్షోభించింది. అశ్రావ్యమైన దానిపేధనాస్వరాలు నాకు వినిపించినయ్! సుమధురమైన నాగగానం నావల్ల అంత్యక్షోభయొక్క స్రుతిని